## క్లుప్తంగా

### పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన తహసీల్దార్



గురజాల : పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ మీసాల దానియేలు శుక్రవారం పరిశీలించారు. మండల పరిధిలోని పులిపాడు గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రం ఉన్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. ఆయనతోపాటు వీఆర్వోలు తదితరులున్నారు.

### తహసీల్దార్‌గా కరుణకుమార్ బాధ్యతలు స్వీకరణ



దాచేపల్లి : మండల తహసీల్దార్‌గా జి.కరుణకుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మేడికొండూరు తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న కరుణకుమార్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన కరుణకుమార్‌ను శాలువా, పూలదండలతో వీఆర్వోలు సన్మానించారు. మండల పరిధిలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని తహసీల్దార్ కరుణకుమార్ చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బ్రహ్మం, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు ఉన్నారు.

### జెండా చెట్టుకు భూమి పూజ

మాచర్ల: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డిలా, తండ్రికి తగ్గ తనయుడిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని బండ్లబజారులో నూతనంగా నిర్మిస్తున్న జెండా చెట్టు నిర్మాణానికి ఆయన భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. జగన్‌కు మద్దతు పలకాలన్నారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన్న ఏసోబు, మాజీ మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ జలీల్, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, మైనార్టీ నేతలు పలువురు ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

### భారతీయ ప్రమాణాలపై క్విజ్



విజయపురిసౌత్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భారతీయ ప్రమాణాలపై స్టాండర్డ్ క్లబ్ మెంటార్ కోట్ల కోటేశ్వరావు ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోటేశ్వరావు మాట్లాడుతూ బ్యూరో ఆఫ్ ఇండియా అనే సంస్థ భారతదేశంలోని జాతీయ ప్రమాణాల గురించి, ఉత్పత్తి నాణ్యత, భద్రత, సేవలకు నాణ్యమైన మార్కులను సెట్ చేయటంలో నిర్వహించే కీలక పాత్ర గురించి వివరించారు. అనంతరం క్విజ్ పోటీలలో ప్రథమ బహుమతి సాధించిన హేమలతకు 1,000 రూపాయలు, ద్వితీయ బహుమతి సాధించిన డి.దివ్యనాథ్‌కు 750 రూపాయలు, తృతీయ బహుమతి సాధించిన మధుకు 500 రూపాయలు, సంతోష్‌కు 250 రూపాయల నగదు బహుమతులను పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు యు.లక్ష్మి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎక్స్‌టర్నల్ మెంటర్ ఆర్ శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయులు సిహెచ్ ఆనంద్‌బాబు, పి రమేష్‌బాబు, ఎం మల్లిఖార్జునరావు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

### స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు మరువరాదు

రెంటచింతల: దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో అశువులు బాసిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు భావితరాలు ఎప్పటికీ మరువరాదని విశ్రాంతి ఎంఈవో గంధ్రకోట వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక సుబ్బన్నతోట కాలనీలోని ఎంపీపీఎస్ పాఠశాలలో స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో పోరాటయోధుల జీవిత చరిత్రలను విద్యార్థులకు బోధించి వారిలో జాతీయ స్ఫూర్తిని కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామ స్థాయిలోనే సమస్యల పరిష్కారం

- పులిపాడులో రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం
- ఇది పేదల ప్రభుత్వం: ఎమ్మెల్యే కాసు



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కాసు

గురజాల : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పులిపాడు గ్రామంలో రెండవ రోజు శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి వారికి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. అందకపోతే సమస్య ఏమిటని సచివాలయ సిబ్బందిని విచారించి సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. గత ప్రభుత్వానికి ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఆయన పాలన చరిత్రలో సువర్ణాధ్యాయంగా నిలిచిపోతుందన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారన్నారు. ప్రస్తుతం ఇస్తున్న పథకాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో కూడా సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మనమంతా గెలిపించుకోవాలన్నారు. గతంలో ఏదైనా ప్రభుత్వ పథకం అందాలంటే తప్పనిసరిగా జన్మభూమి కమిటీల సిఫారసు ఉండాలని కానీ నేడు ఆ అవసరం లేదన్నారు. సీఎం వైఎస్ జగన్ గ్రామ స్థాయిలోనే సమస్యలు పరిష్కరించే విధంగా సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకు వచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్ రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, ఉమ్మడి గుంటూరు రైల్వే బోర్డు డైరెక్టర్ కె.రవిశంకర్, గ్రామ సర్పంచ్ కన్నెబోయిన సైదులు, కో ఆప్షన్ మెంబర్ షేక్ పీర్ అహ్మద్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ కర్రా ప్రగతి కోటేశ్వరరావు, పట్టణ కన్వీనర్ అన్నారావు తదితరులున్నారు.

# దళితులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది

- టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన దళిత నాయకుడు డేగల సామ్యేలు
- ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా : ప్రభుత్వ విప్ పీఆర్కే



డేగల సామ్యేలుకు వైఎస్సార్ సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పీఆర్కే

రెంటచింతల: వైఎస్సార్ సీపీకి వెన్నుదన్నుగా ఉండే ప్రతి కార్యకర్తకు తాను ఎల్లవేళల అండగా ఉంటానని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన రెంటచింతల గ్రామానికి చెందిన టీడీపీ దళిత నాయకులు డేగల సామ్యేలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరగా ఆయనకు ప్రభుత్వ విప్ పీఆర్కే వైఎస్సార్ సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాలకు చెందిన పేద కుటుంబాలకు అండగా ఉంటూ వారి సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన చేస్తూ సంక్షేమ పథకాల ఫలాలు అందిస్తున్నారన్నారు. సీఎం జగన్ తన పాలనలో దళితులకు ఇచ్చిన ప్రాధాన్యత రాష్ట్ర చరిత్రలో ఏ ముఖ్యమంత్రి ఇవ్వలేదన్నారు. దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి అమలుచేయని విధంగా సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దాదాపు 100 శాతం అమలు చేశారన్నారు. సంక్షేమ పథకాలు పేదలకు అందచేయడం వలన పేదలు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి, వైఎస్సార్‌సీపీకి అండగా ఉంటున్నారన్నారు. మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి సమష్టిగా 2024 సార్వత్రిక ఎన్నికలలో భారీ మెజార్టీని తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ పల్నాడు జిల్లా కో ఆర్డినేటర్ మోర్తల ఉమామహేశ్వర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ పార్టీ నాయకులు గుండా కిశోర్, అన్నపురెడ్డి సాంబశివరావు, డేగల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# నాడు–నేడు పనుల పరిశీలన

**జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే**



పాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

గురజాల : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యమిస్తూ పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పులిపాడు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నారులకు విద్యా బోధనపై ఆరా తీశారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని విద్యార్థులను ఎమ్మెల్యే కాసు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో వసతులు కల్పించి చదువుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో చదువుకోవాలనే ఆలోచనతో నాడు–నేడు పనుల్లో భాగంగా మౌలిక వసతులు కల్పించడం జరిగిందన్నారు. కార్పొరేట్ స్థాయి పాఠశాలల్లో కూడా ఈ విధమైన సౌకర్యాలు ఉండవన్నారు. విద్యార్థులు చదువుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతులు తేరావాలన్నారు. విద్యార్థులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. నాడు–నేడులో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ),ఎంపీపీ కొమ్మినేని నారాయణమ్మ బుజ్జి, వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, సర్పంచ్ కె.సైదులు, పరిమి శ్రీను తదితరులున్నారు.

# వైఎస్సార్‌సీపీకి కృతజ్ఞతలు తెలిపిన విశ్వబ్రాహ్మణులు

**విశ్వకర్మ జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించటం హర్షణీయం**



మాచర్ల: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 17న జరిగే విశ్వకర్మ జయంతి సందర్భంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి విశ్వకర్మ జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించటం హర్షణీయమని మాచర్ల పట్టణ విశ్వబ్రాహ్మణుల సంఘం అధ్యక్షులు కె.నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా విశ్వబ్రాహ్మణ సంఘ పెద్దలు శుక్రవారం పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని కలిసి విశ్వకర్మ జయంతిని అధికారికంగా గుర్తించి జీఓ విడుదల చేయటంపై కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ విప్ పీఆర్కే, మూడు జిల్లాల వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలను శాలువాతో సత్కరించారు. అధ్యక్షులు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి రావాలని ఆహ్వానపత్రిక అందజేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి జే జేలు కొట్టారు.

పిడుగురాళ్ల: విశ్వబ్రాహ్మణులను ఆదుకుంది వైఎస్సార్ కుటుంబమేనని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కుందుర్తి గురవాచారి అన్నారు. పట్టణంలోని విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కుటుంబం మాట ఇచ్చారంటే కలకాలం గుర్తుంచుకుంటారని నాడు రాజశేఖర్‌రెడ్డి విశ్వబ్రాహ్మణుల కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. అదే నేడు జగన్ పాదయాత్రలో 4 హామీలు ఇచ్చి 3 అమలు చేశారని అన్నారు. విశ్వబ్రాహ్మణుల కార్పొరేషన్ చైర్మన్ 12 మందిని డైరెక్టర్‌లుగా నియమించారన్నారు. వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయాలకు ధూపదీప నైవేద్య పథకంలో అర్చకులకు జీతభత్యాలు, ఎన్నో సంవత్సరాలుగా విశ్వబ్రాహ్మణుల కోరిక మేరకు (విశ్వకర్మ జయంతి మహోత్సవాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించాలని) నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర పండుగగా ప్రకటించారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు, కార్యకర్తలు రుణపడి ఉంటారని తెలియజేశారు.

# జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన

పిడుగురాళ్ల: పట్టణంలోని సచివాలయాల్లో శనివారం జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందని కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు తెలియజేశారు. పట్టణంలోని జానపాడు రోడ్డులోని వాసవీ కళ్యాణ మండపంలో పట్టణ పరిధిలో వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలకు, శానిటేషన్ సెక్రటరీలకు, హెల్త్ సెక్రటరీలకు, వార్డు వలంటీర్లకు, అంగన్‌వాడీ టీచర్లకు, ఆశా వర్కర్లకు, గృహ సారథులకు, వార్డు కన్వీనర్‌లకు అవగాహన కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందని ఆయన తెలియజేశారు. ఉదయం 9 గంటల నుంచి 10 వరకు 8,9,11,12,13, 14,15 సచివాలయాలకు, 10.30 గంటల నుంచి 11.30 వరకు 1,2,3,4,5,6,7,10,16,17 సచివాలయాలకు అవగాహన కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలియజేశారు.

**జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జయప్రదం చేయండి**

మాచవరం: రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు మండలంలో నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ చక్రవర్తి, డాక్టర్ ప్రసాద్ తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో ఆసుపత్రి అభివృద్ధి సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో హాస్పిటల్ అభివృద్ధి పనులు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణ, జగనన్న ఆరోగ్య సురక్ష, జాతీయ నాణ్యత ప్రమాణాల సంస్థ సందర్శన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎల్లప్పుడూ జిల్లాలో ప్రథమస్థానంలో ఉండే విధంగా సిబ్బంది పని చేయాలని ఆకాంక్షించారు. వివిధ శాఖల సమన్వయంతో పీహెచ్‌సీ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. సిబ్బంది కొరత లేకుండా చూస్తామని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వరప్రసాద్, జెడ్పీటీసీ జివ్వన బోయిన శివాయాదవ్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి, మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య, ఎంపీటీసీ చిట్టిప్రోలు గురవయ్య, గ్రామ సర్పంచ్ రాగిడి నరేష్, మండల నాయకులు పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

### వినాయక మండపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి

**కారెంపూడి సీఐ జయకుమార్**

కారెంపూడి: పల్నాడు జిల్లా ఎస్పీ, డీఎస్పీల ఆదేశాల మేరకు వినాయక చవితి వేడుకల మండపాల ఏర్పాటుకు పోలీస్ శాఖ అనుమతి తీసుకొని పోలీస్ మార్గదర్శకాల ప్రకారం భక్తి భావంతో ప్రశాంతంగా వేడుకలు జరుపుకోవాలని కారెంపూడి సీఐ దార్ల జయకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక చవితి పందిళ్లను పబ్లిక్ స్థలాల్లో కాకుండా ప్రైవేటు స్థలాల్లోనే ఏర్పాటు చేసుకోవాలని, సాధారణ ప్రజా జీవితానికి ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు రాకుండా నిర్వాహకులు చూసుకోవాలని కోరారు. డీజేలు నిషిద్ధమని, మైక్‌ల ఏర్పాటుకు పోలీస్ అనుమతి తప్పని సరిగా తీసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ఉత్సవాలు నిర్వహించుకుంటామని కమిటీ హామీ కూడా ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వినాయక చవితిని భక్తి ప్రపత్తులతో జరుపుకోవాలని ఆర్భాటాలతో ఇతరులకు ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని అలాగే ఊరేగింపులు కూడా ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చేయాలని సూచించారు. వర్గ విభేదాలు రెచ్చగొట్టేవిధంగా ఎవరు ప్రవర్తించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కారెంపూడి, దుర్గి, రెంటచింతల మండలాల పరిధిలోని వివిధ గ్రామాలలో వినాయక చవితి జరుపుకోనున్న అందరూ కూడా పోలీస్ శాఖ మార్గదర్శకాలను తప్పక పాటించి శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని సీఐ కోరారు.

### ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కంటి వైద్య పరీక్షలు

మాచర్ల: పట్టణంలోని ఎస్‌కేబీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కంటి వైద్యురాలు, ప్రిన్సిపాల్ బుల్లయ్య ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా వైద్యురాలు, సచివాలయ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వందలాది మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు.

### నేడు 'మనకోసం శంకరన్న'

అమరావతి: మండల పరిధిలోని మూడు గ్రామాల్లో పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు శుక్రవారం మన కోసం– శంకరన్న కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ నాయుడు రాంబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు వైకుంఠపురం వెంకటేశ్వరస్వామి ఆలయ ఘాట్ రోడ్ నిర్మాణానికి శంకుస్థాపనలో ఎమ్మెల్యే పాల్గొంటారని పేర్కొన్నారు. 11 గంటలకు వైకుంఠపురం , సాయంత్రం 4 గంటలకు చావపాడు, 5 గంటలకు ఎండ్రాయి గ్రామాలలో మండల స్థాయి అధికారులు, గ్రామస్తులతో ప్రజా సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు.

### వినాయక చవితి పందిళ్లకు విద్యుత్ అనుమతి పొందండి

**ఈఈ జె.హరిబాబు**



మాచర్ల: విద్యుత్ డివిజినల్ పరిధిలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే పందిళ్ళకు తప్పనిసరిగా విద్యుత్ శాఖ అనుమతి తీసుకోవాలని ఈఈ హరిబాబు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వెబ్‌సైట్ ఏపీఎస్‌పీడీసీఎల్, విద్యుత్ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకునేలా నిర్ణయం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ విద్యుత్ శాఖ నిర్ణయించిన ధరల ప్రకారం రుసుము చెల్లించి అనుమతులు తీసుకోవాలన్నారు. విద్యుత్ కనెక్షన్‌కు మీ సేవాలో గానీ సచివాలయాలలో గానీ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. తప్పనిసరిగా రసీదులు దగ్గర ఉంచుకొని పందిరి ప్రాంతంలో నాణ్యమైన విద్యుత్ వైర్లు బిగించుకొని జాయింట్‌లు లేకుండా చూసుకోవాలన్నారు. నిర్దేశిత రుసుము చెల్లించి విద్యుత్ కనెక్షన్‌కు అనుమతి తీసుకొని ఆనందంగా వినాయక చవితి జరుపుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

### జగన్‌కు జేజేలు పలికిన డప్పు కళాకారులు



మాచర్ల: రాష్ట్రంలో డప్పు కళాకారుల సమస్యలను గుర్తించి వేలాది మందికి పింఛన్లు మంజూరు చేసి ప్రతి పేద కళాకారులను ఆదుకోవటం అభినందనీయమని జాతీయ బహు కళాకారుల వ్యవస్థాపక అధ్యక్షులు జెట్టిపాలెం వెంకటేష్ జాంబవరాజు అన్నారు. శుక్రవారం పల్నాడు జిల్లా జాతీయ కళాకారుల సమావేశాన్ని సభాధ్యక్షులు ఆలేటి రత్నం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం పట్టించుకోలేదని, రోడ్డు పక్కన చెప్పులు కుట్టుకునే వారిని, డప్పు కళాకారులను గుర్తించిన సీఎం జగన్, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి లకు ప్రత్యేక అభినందనలు తెలుపుతూ తీర్మానం చేశారు. డప్పు కళాకారులు, చర్మకార్మికులు జగన్ ప్రభుత్వానికి మద్దతు పలకాలన్నారు. ఈ సమావేశంలో కంభంపాటి దానం, ఆలేటి దానియేలు, ఆదిరాల సుందరరావు, కడియం సత్తమ్మ, బూడిద లక్ష్మయ్య, కోలా పేతురు తదితరులున్నారు.



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ విప్ పీఆర్కే

# ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన

రెంటచింతల: తన సుదీర్ఘ పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, పార్టీలకు అతీతంగా ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పాలన చేస్తున్నారని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు రామకృష్ణారెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 42వ సచివాలయం 173వ రోజు శుక్రవారం పీఆర్కే రెంటచింతలలోని రైలుపేట కాలనీలో ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్‌లెట్లను పంపిణీ చేశారు. దేశ చరిత్రలో గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలను క్షేత్రస్థాయిలో ప్రజలకు అందిస్తూ గ్రామ స్వరాజ్యం తీసుకువచ్చి సీఎం జగన్ చరిత్ర సృష్టించారన్నారు. పరిపాలనలో అన్ని వర్గాలలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందచేసి సీఎం జగన్ ప్రజాదరణ పొందుతుంటే ఓర్వలేక చంద్రబాబు ఆయన పచ్చ తమ్ముళ్ళు కుళ్ళు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు ఎన్ని కుయుక్తులు పన్నినా తన ఎల్లో మీడియా ద్వారా విషప్రచారం చేసినా ప్రజలు నమ్మే పరిస్థితులలో లేరన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలుచేయని విధంగా రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిచేకూర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కాలనీలోని ఒక్కొక్క కుటుంబానికి ఏఏ సంక్షేమ పథకం ద్వారా ఎంత మేర లబ్ధి చేకూరిందో వివరిస్తూ మీ కుటుంబ సభ్యులు సీఎం జగన్‌కు అండగా ఉండాలని కోరారు. దేశం మొత్తం మన రాష్ట్రం వైపు చూస్తుందంటే దానికి కారణం సీఎం వైఎస్ జగన్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలేనన్నారు. జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ ఆరోగ్య ఆసరా, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ సున్నా వడ్డీ(డ్వాక్రా), వైఎస్సార్ రైతుభరోసా తదితర పథకాల ద్వారా మా కుటుంబాలకు లబ్ధిచేకూరిందని ఎప్పటికీ మేము జగనన్న రుణం తీర్చుకోలేమని రైలుపేట కాలనీ వాసులు పీఆర్కేకు కృతజ్ఞతలు తెలిపారు. కాలనీలోని ప్రతి కుటుంబం దాదాపు 85 వేల నుంచి 4.5 లక్షల రూపాయల వరకు లబ్ధి పొందినట్లు ప్రభుత్వ విప్ పీఆర్కే పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అవినీతికి తావులేకుండా చిత్తశుద్ధితో అమలుచేస్తున్న సీఎం జగన్‌కు రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ రుణపడి ఉంటారన్నారు. చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు ఎన్ని అబద్ధపు మాటలు చెప్పినా తన అనుకూల పత్రికలలో కుతంత్రాలతో కూడిన రాతలు రాయించిన 2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో వైఎస్ జగన్ మరోసారి సీఎంగా అధికారం చేపడతారన్నారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ఫాతిమా మాత మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూజల పుష్పావతి రామయ్య, ఉప సర్పంచ్ పేర్ల చౌడమ్మ, జెడ్పీ వైస్ చైర్మన్ శౌంతిరెడ్డి నర్శిరెడ్డి, జేసీఎస్ పల్నాడు జిల్లా కో ఆర్డినేటర్ మోర్తల ఉమామహేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, వైస్ ఎంపీపీ ఏరువ శౌర్రెడ్డి, మండల ప్రత్యేక అధికారి యల్లా మహాలక్ష్మి, తహసీల్దార్ కె.పుల్లారావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గొట్టం బ్రహ్మారెడ్డి, మాజీ సర్పంచ్ అల్లం ప్రతాప్ రెడ్డి, దుర్గి మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ఆదూరి ఇన్నారెడ్డి, పార్టీ నేతలు బొద్దూరి బ్రహ్మారెడ్డి, తుమ్మా ఇన్నారెడ్డి, మర్రి లూర్దురాజు, బి.సంపూర్ణమ్మ, బాబు, ఏటులు పాశం శ్రీనివాస రెడ్డి, షేక్ మస్తాన్, కె.నరేంద్రారెడ్డి, కార్యదర్శి జి.అనంత కోటేశ్వరరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**సమీక్షలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి**



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. నారాయణపురం ఆర్ అండ్ బీ బంగ్లాలో అధికారులతో శుక్రవారం సమీక్ష జరిపారు. నగర పంచాయతీతో పాటుగా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించి పనులు సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే కాసు సూచించారు. నారాయణపురం ఆర్ అండ్ బీ బంగ్లా నుంచి నడికుడి సచివాలయం వరకు రోడ్డు విస్తరణ సకాలంలో పూర్తి చేసి సుందరీకరణకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కాసు చెప్పారు. రోడ్డు విస్తరణతో ఈ ప్రాంతమంతా అభివృద్ధి చెందుతుందన్నారు. నగర పంచాయతీలో కోట్లాదిరూపాయలతో అభివృద్ధి పనులు చేస్తున్నామని, ఈ పనులు కూడా త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని, నగర పంచాయతీ పరిధిలో రూ.16.50 కోట్లతో ప్రతి ఇంటికి తాగునీరు అందించే కార్యక్రమం చేపడుతున్నామని ఎమ్మెల్యే చెప్పారు. భారీ వరదలు వచ్చిన కాటేరు వాగు నుండి దాచేపల్లికి ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టామని, నాగులేరు ఒడ్డున సర్వీస్ రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నాగులేరుపై లోలెవల్ చప్టా నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువస్తామని కాసు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్రతి ఇంటికి తాగునీరు అందించేందుకు నిధులు మంజూరు చేయించామని, త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని, రాష్ట్రంలో అభివృద్ధి చెందిన నియోజకవర్గాల జాబితాలో గురజాల నియోజకవర్గం ముందు వరుసలో ఉందని ఎమ్మెల్యే అన్నారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా తన శక్తిమేరకు అభివృద్ధి, సంక్షేమ సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, ప్రజలకు మరింతగా అండగా ఉండేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అధికారులు చిత్తశుద్ధితో అమలు చేయటంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని, రానున్న రోజుల్లో కూడా అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ, మాజీ చైర్మన్ మునగా పున్నారావు, వైస్ చైర్మన్లు విజయ్‌కుమార్, ఖాదర్‌బాషా, వైస్ ఎంపీపీలు జాను, అబ్దుల్ సత్తార్, సొసైటీ అధ్యక్షుడు లింగారెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జాకీర్ హుస్సేన్, మండల, పట్టణ కన్వీనర్లు కృష్ణ, సుభానీ, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ నిమ్మయ్య, మాజీ సర్పంచ్‌లు రమేష్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.